క్లుప్తంగా

విద్యార్థినులకు అవగాహన



భీమ్‌గల్: మండలంలోని బెజ్జోర ఉన్నత పాఠశాల విద్యార్థినులకు కౌమారదశంలో వచ్చే మార్పులపై వర్ద్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ మానిటరింగ్ కో–ఆర్డినేటర్ రాజు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ లావణ్య కౌమారదశలో మార్పులను ఏవిధంగా గుర్తించాలి, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బాల్కొండ: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై యాసర్ అర్ఫత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై గురువారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించ రాదని వాటికి దూరంగా ఉండాలన్నారు. వాటితో కలిగే నష్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నయ్య, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో..



రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పర్యవసానాలు, నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి వివరించారు. స్కూల్ హెడ్‌మాస్టర్ సాయిలు, ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి బట్టలను ధరించొద్దు



రుద్రూర్: ప్రతి ఒక్కరూ తడి బట్టలను ధరించొద్దని వాటివల్ల చర్మ వ్యాధులు వస్తాయని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల, శ్రీవేద పాఠశాలల్లో విద్యార్థులకు దోమలు, వర్షాకాలం వచ్చే వ్యాధుల గూర్చి గురువారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాల, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ ముబిన్, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, సావిత్రి, సంగీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం మొహర్రం పండుగ సందర్భంగా పీర్ల ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో సాజిద్, అలీ సాబ్, ఖాదర్, హుస్సేన్, దిలీప్, మదర్, సతీశ్, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



రుద్రూర్: పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న గంగారాం, ఉపాధ్యక్షురాలిగా సావిత్రి, కార్యదర్శులుగా పవార్ హన్మంత్‌రావు, గంగాధర్ పటేల్, సహాయ కార్యదర్శిగా గంగాసాగర్ ఎన్నికైనట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏశాల గంగాధర్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్, నజీర్, శంకర్, విజయ్, తుకారాం, సాయిలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రైతుల పక్షపాతి

- రైతు రుణమాఫీ సంబురాల్లో పలువురు వక్తలు
- అన్ని మండలాల్లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- పలు చోట్ల ర్యాలీ నిర్వహించిన రైతులు, కాంగ్రెస్ నాయకులు



కోటగిరిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజు



ఆలూర్‌లో పాలాభిషేకం చేస్తున్న నాయకులు



నందిపేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



రుద్రూర్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి



బోధన్ మండలం ఊట్‌పల్లిలో నాయకులు, రైతులు

వేల్పూర్/ రెంజల్/ బోధన్‌రూరల్/ నందిపేట్/ పెర్కిట్/ మాక్లూర్/ బాల్కొండ/ రుద్రూర్/ ఎడపల్లి/ నవీపేట/ డొంకేశ్వర్: సీఎం రైతుల పక్షపాతి అని పలువురు వక్తలు అన్నారు. రైతులకు రుణమాఫీ అమలు చేయడంతో జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో సంబురాలు చేపట్టారు. రైతు వేదికల్లో రుణమాఫీపై సీఎం రేవంత్ కాన్ఫరెన్స్‌ను వీక్షించిన అనంతరం రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పటాకులు కాల్చి, ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, పలువురు ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ అమలవుతోందని పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వేల్పూర్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుల చిత్రపటానికి డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. రెంజల్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పటాకులు కాల్చారు. రెంజల్‌తో పాటు బాగేపల్లి, బోధన్ మండలం ఊట్‌పల్లిలో, నందిపేట్, ఆలూర్, మాక్లూర్, ఎడపల్లి మండల కేంద్రాల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. నందిపేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ చేపట్టారు. ఆర్మూర్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని రైతు వేదికల్లో సీఎం సందేశాలను విని రైతులు సంబురాలు నిర్వహించారు. రుద్రూర్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కోటగిరిలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణపురంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటించడం హర్షణీయమని నవీపేట మాజీ జడ్పీటీసీ సాయిబాబాగౌడ్ అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేశామని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తన పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



ముప్కాల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు



రెంజల్‌లో నాయకులు, రైతులు



మాక్లూర్‌లో పాలాభిషేకం చేస్తున్న నాయకులు



డొంకేశ్వర్‌లో పాలాభిషేకం చేస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



వేల్పూర్‌లో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి



బాల్కొండ సీఎం సందేశాన్ని తిలకిస్తున్న రైతులు



ఆర్మూర్‌లో..



ఎడపల్లిలో..

పేదలకు వరం.. కల్యాణలక్ష్మి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఎడపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎడపల్లి: పేదింటి ఆడబిడ్డలు కుటుంబానికి భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకం పేదలకు వరం లాంటిదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, నాయకులు రామ్మోహన్, నారాయణ చౌదరి, కృష్ణారావు, శంకర్ నాయుడు, శ్రీనివాస్, మోహన్ రెడ్డి, జయవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం



చెక్కు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

వేల్పూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సిరికొండ బాలయ్య అనే రైతుకు పంట రుణమాఫీ చెక్కును గురువారం అందజేశారు. దివంగత ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేసిన మాదిరిగా ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఒకేసారి పంటరుణాలను మాఫీ చేస్తున్నారని అన్నారు. వేల్పూర్ మండలంలో లక్షలోపు రుణాలు ఉన్న 1021 మంది రైతులకు రూ. 5కోట్ల70లక్షల45వేలు మాఫీ అయినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వేల్పూర్: మండలంలోని మోతె హైస్కూలులో ఇటీవల బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. మోతె నుంచి వెళ్లిన ఉపాధ్యాయులు మస్రత్‌బేగం, రాగిణి, మమత, పీడీ రవికాంత్‌లను జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైద్య గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని కుకునూర్ హైస్కూలుకు పదోన్నతిపై వచ్చిన తెలుగు పండితుడు పఠాని గంగాధర్‌ను మాజీ వైస్ ఎంపీపీ భోజపల్లి సురేశ్, మాజీ సర్పంచ్ శ్రీరాం లింబాద్రి, హెచ్‌ఎం హరిచరణ్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మెడల్ స్కూల్, బ్రిలియంట్ స్కూల్‌లో గురువారం ఏబీవీపీ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, మంత్రి రాజు, సాగర్, మోహన్, లెనిన్, ప్రీతం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బెల్ అందజేత

పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఖానాపూర్ ప్రైమరి పాఠశాల ఉపాధ్యాయుడు కిషన్‌రెడ్డి ఎలక్ట్రిక్ బెల్‌ను గురువారం అందజేశారు. హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



ఆర్మూర్: రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో రూ. లక్షలోపు పంట రుణ మాఫీ తెల్లరేషన్ కార్డు లేనివారికి ఎవరికీ కాలేదన్నారు. మొదటి విడతలో రూ. లక్ష రుణమాఫీ లిస్ట్‌లో పేరు లేని చాలా మంది సన్న కారు రైతులే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టడి లింగారెడ్డి, మాక్లూర్ మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్, నాయకులు పోలసుధాకర్, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ పాల్గొన్నారు.

నాగాపూర్ లిఫ్ట్ మరమ్మతులు చేపట్టండి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

బాల్కొండ: నాగాపూర్ శివారులో నిర్మించిన లిఫ్ట్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామ కమిటీ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. లిఫ్ట్ ద్వారా నీరు అందక పంటలు వేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు కావాలని..

ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఆ పాఠశాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించారు. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండు తరగతి గదుల కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు.

విప్లవ ఉద్యమానికి తీరని లోటు



చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



నందిపేటలో..

ఆర్మూర్‌టౌన్/ నందిపేట్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ మృతి ప్రజా విప్లవ ఉద్యమాలకు తీరని లోటని డివిజన్ కార్యదర్శి దేవారాం అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో గురువారం ఆర్మూర్ సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రజా, రైతాంగ పోరాటాల్లో 50 ఏళ్లు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్తెన్న, బి కిషన్, మచ్చర్ల రాజన్న, పద్మ, ఆకుల గంగన్న, తలారి గంగాధర్, అమినాపూర్ రమేశ్, నజీర్, తూర్పాటి శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. నందిపేట మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె గంగాధర్, భూమన్న, రఫిక్, సతీశ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు

బోధన్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) జాతీయ నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. పట్టణ కేంద్రంలో చంద్రశేఖర్ చిత్ర పటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, నాగమణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి



ఆర్మూర్‌టౌన్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు పల్లపు వెంకటేశ్, కుతాడి ఎల్లయ్య, ఆశావర్కర్లు సలీమ, శిరీష, భాగ్య, వనిత, అనురాధ, ప్రమీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గుంత ఉంది జాగ్రత్త!



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్మశానవాటికకు వెళ్లేదారిలో ప్రమాదకరంగా గుంత ఉంది. ప్రతి రోజూ రైతులు ఆ రహదారి గుండా పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా చనిపోయినా అంత్యక్రియలకు సైతం అదే దారి గుండా వెళ్తారు. కాగా దారి మధ్యలో ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులే ఆ గుంత చుట్టూ రాళ్లు వేసి ఉంచారు. అధికారులు స్పందించి గుంత పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టెక్నికల్ విద్యతోనే ఉద్యోగం



మాక్లూర్: టెక్నికల్ విద్యతోనే త్వరగా ఉద్యోగం పొందే అవకాశం ఉందని టీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన కళాశాల ఫస్టియర్ విద్యార్థులతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాలిటెక్నిక్ చదువును ఎంచుకోవటం అభినందనీయమని అన్నారు. ప్రత్యేక శ్రద్ధతో చదివి అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రమాప్రభ, ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు ఎస్ స్వప్న, శ్రీకాంత్‌కుమార్, సంధ్య, సందీప్, నరేశ్, అలేఖ్య, నవనీత, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



దుకాణాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న డిపో మేనేజర్, పోలీసులు

బోధన్‌టౌన్: బోధన్ ఆర్టీసీ డిపో స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను కోర్టు ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు సహాయంతో గురువారం జేసీబీతో తొలగించారు. డిపో స్థలంలో అక్రమంగా వెలిసిన దుకాణాలను తొలగించాలని నిర్వాహకులకు గత రెండు నెలల నుంచి కోర్టు నుంచి నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణ సీఐ వీరయ్య పర్యవేక్షణలో పోలీసుల పహారాతో దుకాణాలను తొలగించినట్లు పేర్కొన్నారు. డిపో ఆవరణలో అక్రమంగా ఏర్పాటు చేసిన రెండు దుకాణాల్లో ఒక దుకాణం ఆర్టీసీ ఉద్యోగిది కావడం గమనార్హం.

ఎడిట్ ఆప్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌టౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన పథకం ఎడిట్ ఆప్షన్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ మేనేజర్ నరేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలన దరఖాస్తులో ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారిన వారికి కరెంట్ బిల్లులో ఎడిట్ సౌకర్యం కల్పించిందని వెల్లడించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ట్విస్టర్ (హిందీ) – 11.50, 6.40, 9.30 భారతీయుడు–2 (తెలుగు) – 02.45
స్క్రీన్-2 –	కల్కి – 2898 ఏడి (3డీ–తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3 –	డార్లింగ్ (తెలుగు) – 11.40, 3.05, 6.25, 9.45
స్క్రీన్-4 –	ది బర్త్‌డే బాయ్ (తెలుగు) – 02.20, క్రైమ్ రీల్ (తెలుగు) – 5.00 పేకమేడలు (తెలుగు) – 7.35 భారతీయుడు–2 (తెలుగు) – 10.15

న్యాయమూర్తికి సన్మానం



బోధన్‌టౌన్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి శేషతల్ప సాయిని లయన్స్ క్లబ్ ఆఫ్ అపెక్స్ వైటల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ అపెక్స్ వైటల్ ప్రెసిడెంట్ జెరుష, అనిల్, పల్లెపాటి శ్రీధర్, లంక రవి, కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, నాగభూషణం, సాయిబాబా గౌడ్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన

నవీపేట: బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల పరిధిలోని కార్మికులు గురువారం నవీపేటలో ఆందోళన చేపట్టారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు.

వేతనాలు చెల్లించాలి

నవీపేట: అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల పరిధిలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చెల్లించకపోతే కార్మికుల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

దంచి కొట్టిన వాన



వేంపల్లిలో పంటభూముల్లో చేరిన వర్షపు నీరు



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి వర్షం జోరుగా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి, మెండోరా మండల కేంద్రంలోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది. పొలాల్లోకి వర్షపు నీరు రావడంతో వరి నాట్లు వేయడం జోరందుకుంది.